క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

గార్లదిన్నె: కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకులు రామాచార్యులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజ వంటి ప్రత్యేక పూజలు చేశారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి, 108 శివలింగాలను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు.

పెద్దమ్మ గుడిలో ప్రత్యేక పూజలు

యల్లనూరు: మండల కేంద్రంలోని పాతపేటలో పెద్దమ్మ గుడిలో కార్తీక మాసం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు, అర్చనలు అభిషేకాలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా కుంటెమ్మ విగ్రహ ప్రతిష్ట



ప్రతిష్ఠించిన కుంటెమ్మ విగ్రహం

గార్లదిన్నె: స్థానిక ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మించిన ఆలయంలో కుంటెమ్మ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా గ్రామస్తులు కుంటెమ్మ అమ్మవారి విగ్రహానికి అభిషేకాలు జరిపి ప్రత్యేకంగా అలంకరించి, పూజలు, హోమాలు చేపట్టారు. అనంతరం వేదమంత్రోచ్చారణ నడుమ విగ్రహ ప్రతిష్ట నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల సౌకర్యార్థం అన్నదానం నిర్వహించారు.

బాలల దినోత్సవ ఆరాధన



మాట్లాడుతున్న పాస్టర్ రెవరెండ్ బీవీ మోహన్

పామిడి: స్థానిక సీఎస్ఐ చర్చిలో ఆదివారం బాలల దినోత్సవ ఆరాధనను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాస్టర్ రెవరెండ్ బీవీ మోహన్ మాట్లాడుతూ ఆడపిల్ల అవనికి వెలుగు అన్నారు. మహిళలను గౌరవించాలన్నది మన సాంప్రదాయమన్నారు. బైబిల్ గ్రంథంలోని బాలికల ప్రాముఖ్యతను ఆయన వివరించారు. చర్చి సెక్రటరీ పరదేశి విజయ శేఖర్‌రాజు, సభ్యులు వీరయ్య, అబ్రహాం, జయరాజు, రత్నరాజు, కిష్టఫర్ బాబు, కరుణాకర్, రూబేను, ప్రసాద్, రజని, మంజుల, సుశీలమ్మ, మహిమ, జయామణి, వాణి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడిన యువకులు

గుత్తి: కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరి సమీపంలో ఆదివారం రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు.. యాదగిరికి చెందిన భీమాశంకర్, నాగరాజు బైక్‌పై యాదగిరి నుంచి బెంగళూరుకు బయలు దేరారు. అయితే మార్గం మధ్యలోని జొన్నగిరి సమీపంలో ముందు వెళుతున్న కారును వీరు ప్రయాణిస్తున్న బైక్ ఢీ కొంది. ప్రమాదంలో వారిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు క్షతగాత్రులను గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యులు అనంతపురం రెఫర్ చేశారు. ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

బైక్‌పై నుంచి పడి..

గుత్తి రూరల్: మండలంలోని లచ్చానుపల్లి శివారులో ఆదివారం బైక్‌పై నుంచి పడి ఓ యువకుడు గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. లచ్చానుపల్లి గ్రామానికి చెందిన పెద్దిరాజు పనిపై బైక్‌లో గుత్తికి వచ్చాడు. అక్కడ పని ముగించుకొని తిరిగి గ్రామానికి వెళ్తుండగా గ్రామ శివారులో గొర్రెలను తప్పించబోయి పెద్దిరాజు బైక్‌పై నుంచి కిందపడ్డాడు. ప్రమాదంలో గాయపడిన పెద్దిరాజును స్థానికులు చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లాభాల బాటలో కొర్ర రైతు

- ప్రభుత్వ ప్రోత్సాహంతో 570 ఎకరాల్లో పంటసాగు
- ఎకరానికి 6 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి
- మార్కెట్‌లో క్వింటాల్ రూ.5,400
- సంతోషంలో రైతన్నలు



సాగుచేసిన కొర్రపంట

పెద్దపప్పూరు: కొర్ర రైతులు లాభాల బాట పట్టారు. తక్కువ పెట్టుబడితో మంచి దిగుబడి ధరలు లభిస్తుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఏటా సంప్రదాయం సాగు చేసే పంటలతో పెట్టుబడులు పెరగడం, ఆశించిన దిగుబడులు రాకపోవడంతో రైతులు నష్టాల పాలయ్యేవారు. దీన్ని గుర్తించిన ప్రభుత్వం చిరుధాన్యాల సాగు వైపు రైతులను ప్రోత్సహిస్తోంది. వీటి సాగుతో తక్కువ పెట్టుబడితో లాభాలు గడించవచ్చని తెలియజెప్పింది. దీంతో చాలా మంది రైతులు చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించారు.

కొర్ర సాగుపై మొగ్గు..

ప్రభుత్వం ఒక్కో రైతుకు నాలుగు కిలోల కొర్ర విత్తనాలను పంపిణీ చేసింది. తాడిపత్రి మండలం చిన్నపొలమడ, కోమలి, పెద్దపొలమడ, గన్నెవారిపల్లి, వెంకటరెడ్డిపల్లి, పెద్దపప్పూరు మండలం దేవునిఉప్పలపాడు, పసలూరు, గార్లదిన్నె, కుమ్మెత, పెండేకల్లు, నరసాపురం, జోడిధర్మాపురం, అత్తిరాలదిన్నె తదితర గ్రామాల్లో దాదాపు 570 ఎకరాల్లో కొర్రపంట సాగుచేసినట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం నూర్పిడి పనులు జరుగుతున్నాయి. నేల స్వభావాన్ని బట్టి ఎకరాకు 6 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. మార్కెట్‌లో క్వింటాల్ ధర రూ.5,400 పలుకుతోంది. పంట సాగు చేసినప్పటి నుంచి కోత దశ వరకూ ఎకరానికి రూ.2 వేలు మాత్రమే పెట్టుబడి అవుతుందని అన్నదాతలు చెబుతున్నారు.

25క్వింటాళ్ల దిగుబడి వచ్చింది



నాకున్న 2.50 ఎకరాల్లో ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసిన కొర్రవిత్తనాలతో వర్షాధారం కింద పంట సాగుచేశాను. ఎకరానికి పంటకోత దశవరకు రూ.2500 పెట్టుబడి అయింది. ఎకరానికి 10 క్వింటాళ్ల చొప్పున 25 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మార్కెట్‌లో క్వింటాల్ రూ.5400 ధర పలుకుతోంది. ఈ లెక్కన నాకు రూ.1.35 లక్షలు ఆదాయం వస్తుంది.

–శివయ్య, రైతు కుమ్మెత(పెద్దపప్పూరు)

తెగుళ్ల బెడద ఉండదు



ఏపంట సాగుచేసినా తెగుళ్ల రావడం సహజం. కానీ కొర్రపంటకు ఎలాంటి తెగుళ్ల ఆశించవు. పంట విత్తిన నాటి నుంచి మూడు, లేదా నాలుగు సార్లు వర్షం వస్తే పంట చేతికందుతుంది. నాలుగేళ్ల క్రితం ఈ పంట చాలా అరుదుగా కన్పించేది. ప్రస్తుతం పెట్టుబడి తక్కువ కావడంతో పాటు ఆశించిన దిగుబడి రావడమేగాక మార్కెట్టులో డిమాండు పెరగడంతో చాలామంది కొర్ర సాగుపై మొగ్గుచూపుతున్నారు.

–బాలనరసింహారెడ్డి, రైతు పెద్దపొలమడ(తాడిపత్రి)

కొర్రలకు డిమాండు



ఎలాంటి రసాయన ఎరువులు, మందులు వాడకంలేని పంట కావడంతో కొర్రలకు మార్కెట్‌లో డిమాండు పెరిగింది. నాలుగేళ్లుగా పంట సాగు విస్తీర్ణం పెరుగుతోంది. నేల స్వభావాన్ని బట్టి ఎకరానికి 6 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటా రూ.5400 ధర పలుకుతోంది. షుగర్ వ్యాధిగ్రస్తులు ఎక్కువగా కొర్రబియ్యం వాడడంతో మార్కెట్‌లో డిమాండ్ పెరిగింది.

–చెంగలరాయుడు ఏడీఏ తాడిపత్రి

నేడు 'స్పందన'

యల్లనూరు: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సుమతి తెలిపారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అందించాలని కోరారు. మండల అధికారులు తప్పక హాజరుకావాలని సూచించారు.

చిత్రచేడులో నేడు 'వై ఏపీ నీడ్స్ జగన్'

పెద్దవడుగూరు: చిత్రచేడు గ్రామంలో సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎద్దుల శరభారెడ్డి తెలిపారు. గ్రామ సచివాలయ పరిధిలోని ఉద్యోగులు, వలంటీర్లు తప్పకుండా హాజరుకావాలని సూచించారు.

పాముకాటుతో మహిళకు అస్వస్థత

గుత్తి రూరల్: కర్నూలు జిల్లా తుగ్గలి మండలం పగిడిరాయి గ్రామంలో ఆదివారం ఓ మహిళ పాముకాటుతో అస్వస్థతకు గురైంది. వివరాలు..గ్రామానికి చెందిన సురేఖ ఆదివారం వేకువజామున ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో పాముకాటు వేసింది. అయితే సురేఖకు నొప్పి అనిపించి నిద్రలేచి చూడగా పాము వెళ్తుండటాన్ని గమనించి కుటుంబసభ్యులకు తెలిపింది. వెంటనే సురేఖని గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురం తీసుకెళ్లారు.

వైభవంగా నందీశ్వరుడి విగ్రహ ప్రతిష్ట



నందీశ్వరునికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సతీమణి రమాదేవి



పూజల్లో పాల్గొన్న కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

తాడిపత్రి అర్బన్: బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయం నందీశ్వరుని విగ్రహ ప్రతిష్ట ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి గణపతి పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య ప్రోక్షణ, కలశ స్థాపన, మండప ఆరాధన, గణపతి, శాంతి హోమం చేపట్టారు. ఉదయం 9.43 నిమిషాలకు నందీశ్వర విగ్రహాన్ని వేదమంత్రోచ్చారణల నడుమ ప్రతిష్ఠించారు. అనంతరం వైభవోపేతంగా 108 కలశాలతో పసుపు, కుంకుమ, గంధం, విభూతి, పాలు, సుగంధద్రవ్యాలతో నందీశ్వరునికి మహాభిషేకం నిర్వహించారు. ఉదయం 11 గంటలకు నందీశ్వరునికి ప్రత్యేక అలంకారం చేసి దశవిధ హారతులతో పాటు మహామంగళ హారతి ఇచ్చారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సతీమణి కేతిరెడ్డి రమాదేవి, యువ నాయకుడు కేతిరెడ్డి హర్షవర్దన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి నందీశ్వరునికి పూజలు చేసి దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి, మార్కెట్‌యార్డు మాజీచైర్మన్ వి.రంగారెడ్డి, బుగ్గరామలింగేశ్వరస్వామి, చింతల వెంకటరమణస్వామి ఆలయాల చైర్మన్లు పోలిశెట్టి ఆంజనేయులు, వేలూరి మురళీప్రసాద్ రెడ్డి, నాయకులు గోసు రామచంద్రారెడ్డి, నరసింహారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సమగ్రశిక్ష క్యాంప్ ఫైర్



కార్యక్రమంలో పాల్గొన్న డీఈఓ, సమగ్ర శిక్ష ఏపీసీ తదితరులు



క్యాంప్ ఫైర్ పాల్గొన్న సీఆర్టీలు, పీటీజీలు

అనంతపురం ఎడ్యుకేషన్: నగర శివారులోని వైవీ శివారెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్‌లో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో కేజీబీవీ సీఆర్టీలు, పీజీటీలకు జరుగుతున్న ఇండక్షన్ ట్రైనింగ్‌ను పురస్కరించుకొని ఆదివారం రాత్రి నిర్వహించిన క్యాంప్ ఫైర్ ఉత్సాహంగా సాగింది. సమగ్ర శిక్ష ఎస్పీడీ ఆదేశాల మేరకు ఈ ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి నాగరాజు, సమగ్ర శిక్ష ఏపీసీ వరప్రసాదరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. హాలులో కాకుండా ఆరుబయట సమావేశం ఏర్పాటు చేశారు. డిస్‌ప్లే బోర్డ్ ఏర్పాటు చేసి, ట్రైనింగ్‌లో తయారు చేసిన మెటీరియల్‌ను ప్రదర్శించారు. ఏపీసీ మాట్లాడుతూ పిల్లలందరికీ గుణాత్మక విద్య బోధించాలని సూచించారు. డీఈఓ మాట్లాడుతూ కేజీబీవీల్లో చదివే బాలికల్లో ఎక్కువగా అనాథలు, తల్లి గానీ తండ్రి గానీ లేని వారు, పేద పిల్లలు ఉంటారన్నారు. వారిని సొంత పిల్లల్లా చూసుకోవాలన్నారు. బాల్య వివాహాలు జరగకుండా చూడాలన్నారు. శిక్షణలో నేర్చుకొన్న అంశాలను బోధనలో అమలు చేయాలన్నారు. జాయింట్ డైరెక్టర్ గీత మాట్లాడుతూ డ్రాపౌట్స్ లేకుండా చూడాలన్నారు. కేజీబీవీల్లో చదువుతున్న ఆడపిల్లలు ఉన్నత స్థానాలకు ఎదిగేలా కృషి చేయాలన్నారు. వందశాతం ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం నిర్వహించిన వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకులు ఇస్మాయిల్, జీసీడీఓ మహేశ్వరి, ఏఎంఓ చంద్రశేఖర్‌రెడ్డి, అలెస్కో గోవిందెడ్డి, అసిస్టెంట్ ఏఎంఓ మాధవరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఝాన్సీలక్ష్మీబాయి, ఇందిరాగాంధీ జయంతి



మాట్లాడుతున్న గ్రంథాలయాధికారి కమ్మన్న

గుంతకల్లు: స్థానిక రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం ఝాన్సీలక్ష్మీబాయి, ఇందిరాగాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఈఓ రాముడు, జీఎంవీ చలపతి ఝాన్సీలక్ష్మీబాయి, ఇందిరాగాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళ వారిని ఆదర్శంగా తీసుకొని అన్ని రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సభ్యులు బషీర్, శాంతిపాల్, విశ్వనాథ్, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో..

గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో ఇందిరాగాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రథమశ్రేణి గ్రంథాలయాధికారి సీ.కమన్న ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎస్‌కేపీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సాలాబాయి హాజరై మహిళా సాధికరిత, దిశచట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అసిస్టెంట్ గ్రంథాలయాధికారిని ఏ.హేమలత, రికార్డ్ అసిస్టెంట్ రాము పాల్గొన్నారు.

'దిశ'పై అవగాహన

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వ గ్రంథాలయంలో ఆదివారం దిశా చట్టం, మహిళా సాధికారతపై పాఠకులకు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయాధికారి రామాంజనేయులు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి రామాంజనేయులు, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, విద్యార్థులు దిశా చట్టం, మహిళా సాధికారతను వివరించారు. దిశా చట్టం మహిళలకు రక్షణ కవచం లాంటిదన్నారు.

దిశ యాప్‌తో మహిళలకు రక్షణ

గార్లదిన్నె: దిశ యాప్‌తో మహిళలు రక్షణ లభిస్తోందని గ్రంథాలయ అధికారిణి శిరీష పేర్కొన్నారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మాజీ ప్రధాని ఇందిరా గాంధీ, ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

పామిడి: గ్రంథాయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురష్కరించుకొని ఆదివారం విద్యార్థులకు దిశ యాప్‌పై అవగాహన కల్పించారు. గ్రంథాలయాధికారి సీ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో వక్తలు యాప్ ప్రాధాన్యతను వివరించారు.

జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలి



ప్రభుత్వ మేలును వివరిస్తున్న గృహసారథులు, వలంటీర్లు

యాడికి: రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగాలంటే జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఆసుపత్రి కాలనీలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ, నాయకులుగృహసారథులు ఆదివారం ఇంటింటికీ తిరిగి ఆయా కుటుంబాలకు అందిన సంక్షేమ పథకాలను వివరించి బుక్‌లెట్‌ను అందజేశారు. గత ప్రభుత్వంలో పూర్తి చేయని హామీలు, జగనన్న ప్రభుత్వం వచ్చాక నెరవేరిన ఎన్నికల హామీలను సరిపోల్చి చూసి సీఎంకు మద్దతు తెలపాని కోరుతూ వారి అభిప్రాయాన్ని నమోదు చేసుకున్నారు. ప్రజల నుంచి మళ్లీ సీఎం జగనన్నే అంటూ మద్దతు వెల్లువెత్తింది. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సోషియల్ మీడియా కన్వీనర్ ఫరూక్, సచివాలయ కన్వీనర్లు దూద్‌వలి, పెద్దిరాజు, పఠాన్ రజియా, జేసీఎస్ కన్వీనర్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గుండె వైద్య శిబిరం



వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

తాడిపత్రి అర్బన్: తొగట వీర క్షత్రీయ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గన్నెవారిపల్లి కాలనీలోని సాయిశ్రీ స్కూల్‌లో ఉచిత కంటి, గుండె వైద్య శిబిరం నిర్వహించారు. కర్నూలుకు చెందిన శ్రీచక్ర హాస్పిటల్‌కు చెందిన వైద్యులు 200 మందికి పరీక్షలు చేశారు. ఇందులో కంటి శస్త్ర చికిత్సలకు 60 మంది, గుండెకు సంబంధించిన శస్త్ర చికిత్సకు ముగ్గురిని ఎంపిక చేసి ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో తొగటవీర క్షత్రియ సంఘం అధ్యక్షుడు నాగేంద్ర, సభ్యులు తులసిదాసు, బాలాజీ, నారాయణస్వామి, రాజగోపాల్, చిన్నస్వామి పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు

బుక్కరాయసముద్రం: గ్రామాల్లో ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ నాగార్జున రెడ్డి హెచ్చరించారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రానున్న ఎన్నికల దృష్టిలో ఉంచుకుని శాంతిభద్రతలకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. రౌడీ షీట్ ఉన్న వ్యక్తులు ఎలాంటి గొడవలకు పాల్పడరాదన్నారు. అనవసరంగా ఎవరైగా రెచ్చ గొట్టేలా వ్యాఖ్యలు చేసినా, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్ఐలు శ్రీనివాసులు, శివ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

బెడ్‌షీట్లు అందజేత

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఆవరణలోనూ , వార్డుల ఆరుబటయ నిద్రిస్తున్న రోగుల బంధువులకు ఎస్కేయూ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో బెడ్‌షీట్లు అందించారు. ఆదివారం అర్ధరాత్రి ఎస్కేయూ ఉపకులపతి ప్రొఫెసర్ రామకృష్ణా రెడ్డి, తదితరులు ఆస్పత్రి వద్ద బెడ్‌షీట్లు అందించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఎస్కేయూ వీసీ పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు రాంగోపాల్, మురళీధర్ రావు, ఎంవీ శ్రీనివాసన్, టీచింగ్ అసిస్టెంట్ నాగేంద్ర పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్ అందించడమే లక్ష్యం

- ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి
- రూ.2 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు భూమిపూజ



గుంతకల్లులో సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్



పామిడిలో విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లుటౌన్: పట్టణంలోని జగనన్న లేఔట్లలో ప్రజలకు మెరుగైన సదుపాయాలను కల్పించడంతో పాటు నిరంతర విద్యుత్‌ను అందించడమే జగనన్న ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని దోనిముక్కల రోడ్ టిడ్కో గృహ సముదాయం వద్ద రూ.2 కోట్ల వ్యయంతో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గృహ వినియోగంతో పాటు వ్యవసాయరంగానికి నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదేనని చెప్పారు. జగనన్న లేఔట్‌లతో పాటు శివారుకాలనీల్లో కూడా ఎటువంటి విద్యుత్ సమస్యలేకుండా చూడటం కోసం నియోజకవర్గంలో 5 విద్యుత్ సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. మరో 2 సబ్‌స్టేషన్లు కూడా మంజూరు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. కౌన్సిలర్లు దర్గాచెన్నమ్మ, భాస్కర్, ట్రాన్స్‌కో ఈఈ రాజశేఖర్, డీఈ రంగస్వామి, ఏఈతో పాటు వార్డు ఇన్‌చార్జ్ ఎల్లప్ప, నాయుడు పాల్గొన్నారు.

మంజూరైన రోడ్డు వద్ద సెల్ఫీలు దిగడమేంటి?

దోనిముక్కల రోడ్డులో నాలుగైదు రోజుల్లో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమవుతున్న తరుణంలో టీడీపీ, జనసేన నాయకులు రోడ్డు గుంతలమయమైందంటూ అక్కడికెళ్లి సెల్ఫీలు దిగడం సిగ్గుచేటని ఎమ్మెల్యే వైవీఆర్ విమర్శించారు. మంజూరైన రోడ్డు వద్దకు వెళ్లి నిరసన తెలపడం, పనులు ప్రారంభమయ్యాక తమ పోరాటం వల్లనే మొదలు పెట్టారని చెప్పుకునే స్థాయికి ఆయా పార్టీల నాయకులు దిగజారిపోయారన్నారు.

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

పామిడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా తమ ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక జగనన్న కాలనీ సమీపాన రూ.1.5 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలో కేవలం ఆర్భాటం తప్పా అభివృద్ధి చేసిన పాపాన పోలేదన్నారు. సీఎం జగన్ తన ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన హామీల్లో 99 శాతం హామీలను నేరవేర్చారని గుర్తు చేశారు. రామరాజ్యాన్ని తలపిస్తున్న సీఎం జగన్ పాలన కొనసాగాలంటే మరోసారి జగన్‌ను సీఎం చేయడానికి అన్ని వర్గాల ప్రజలు ఆయనను ఆశీర్వదించాలని కోరారు. స్థానిక అంబేడ్కర్ కాలనీకి, సత్యసాయి వాటర్ ప్రాజెక్టుకు 24 గంటల కరెంటుకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దిలీప్‌రెడ్డి, ఇన్‌చార్జ్ జానకిరామిరెడ్డి, పట్టణ కన్వీనర్ జోజోడే కుమార్, జెడ్పీటీసీ ఎల్ శోభారాణి, ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి, గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి, ఓసీ విభాగం డైరెక్టర్ కుమ్మెత లక్ష్మి, బీసీ విభాగం డైరెక్టర్ దత్తు, పట్టణ బూత్‌లెవెల్ కన్వీనర్ వెంకటగుప్తా, రామచంద్రా, నక్కా ఓబులేసు, వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.